# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 06 | సోమవారం | 3-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:06 | Monday | 3-8-2026 | Pages:08 | Cost:2/-







## ఆరు నెలల యుద్ధానికి ముగింపు?..

- ఇరాన్‌తో నేటినుంచి కొత్త చర్చలు
- ఇరాన్‌పై భారీ సైనిక దాడిని విరమించుకున్న ట్రంప్
- నేటి నుంచి కొత్తగా చర్చలు ప్రారంభమవుతాయని ప్రకటన
- హర్మ్యూజ్ జలసంధి, అణు నిరాయుధీకరణపై ప్రధానంగా చర్చలు
- ట్రంప్ ప్రకటనతో పడిపోయిన అంతర్జాతీయ చమురు ధరలు



2లో



## కేరళలో వర్ష బీభత్సం

8 మంది మృతి.. 8 మంది గల్లంతు

2లో

## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం.. యువతకు ప్రధాని మోదీ పిలుపు

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని



2లో

## ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల

- నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- సాధారణ తేదీ కంటే ముందుగానే నిధులు విడుదల చేయడంపై హర్షం
- ఈ సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని వెల్లడి
- కేంద్ర సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు



ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నుల వాటాను విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో అందిన ఈ ఆర్థిక చేయూత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల అవుతుంది. అయితే, ఈసారి గడువుకు ముందే ఏపీకి అదనంగా రూ.4,597 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు.

- మిగతా 2వ పేజీలో



## మహంకాళీ... కాపాడాలి

- అంగరంగ వైభవంగా లష్కర్ బోనాలు
- ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- పూజలు చేసిన మంత్రులు, ఇతర ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: చరిత్రాత్మకమైన లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు వేలాది మంది తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్నారు. జాతర సందర్భంగా వేకువజామున 4.05 గంటలకు నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.45 గంటలకు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనతోపాటు మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఆలయ చైర్మన్ కామేష్, ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి సీఎంకు స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు పవన్‌ఖేరా, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, నవీన్‌యాదవ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- మిగతా 2వ పేజీలో

## ఇంటింటికీ టీడీపీ: ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు..

- ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్
- ఆదివారం సెలవు రోజైనా 3 లక్షలకు పైగా గృహాలను సందర్శించిన నేతలు
- టెలీకాన్ఫరెన్స్ ద్వారా పురోగతిని సమీక్షించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- టెక్నాలజీతో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-- సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఏడు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,61,197 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు.

2లో





2లో

## బోనాలను గతంలో పట్టించుకోలేదు.. కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా

- సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్
- గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ
- కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి
- వర్షాలు బాగా పడి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడి

నేడు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

- మిగతా 2వ పేజీలో

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన

- మిగతా 2వ పేజీలో





## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్.. కోర్టులో హాజరు

- ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు
- ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు
- అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

- మిగతా 2వ పేజీలో

# మహంకాళీ... కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌రావు, హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా, ప్రభుత్వ సలహాదారులు వి.హన్మంతరావు, వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ ఆల ప్రియాంక, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే బోనాల జాతరను విశ్వవ్యాప్తం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. తల్లి ఆశీర్వాదంతోనే తెలంగాణ సాధించాం. అమ్మకు ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి వర్షాలు బాగా కురవాలి, రైతులందరూ సంతోషంగా ఉండాలని మొక్కుకున్నా.

**తెలంగాణ అగ్రగామిగా ఉండాలి: మహేశ్‌గౌడ్**

దేశంలో తెలంగాణ అగ్రగామిగా నిలిచేలా అమ్మవారు ఆశీర్వదించాలని మొక్కుకున్నా. వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలి.

## బోనాలను గతంలో పట్టించుకోలేదు.. కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కేరళలో వర్ష బీభత్సం

తిరువనంతపురం: కేరళలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర-నష్టం మిగిల్చాయి. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 8 మంది చనిపోగా మరో 8 మంది గల్లంతయ్యారు. కనీసం 13 మంది గాయపడ్డారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడగా, లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. మొత్తం 27 నివాసాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 209 సహాయక శిబిరాల్లో వేల మంది ఆశ్రయం పొందుతున్నారని సీఎం సతీశన్ తెలిపారు.

**కర్ణాటకలో కుండపోత వానలు**

కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొప్పాల్ జిల్లాలో కొండపక్కనున్న నివాసంపై మట్టి పెళ్లలు విరిగిపడి మూడేళ్ల చిన్నారి సహా ముగ్గురు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. శివమొగ్గ జిల్లా అగుంబెలో 24 గంటల వ్యవధిలో 197 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. కొడగు, ఉడుపి, చిక్కమగళూరు, సిర్సి, మంగళూరుల్లోనూ కుండపోతగా వాన కురిసింది. గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లోనూ ఆదివారం విస్తారంగా వర్షాలు ముంచెత్తాయి.

## ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

"అదనపు పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. ఈ సహకారం రాష్ట్ర పురోగతికి గొప్పగా దోహదపడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి అందిన ఈ అదనపు నిధులు, రాష్ట్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు ఊతమిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఇంటింటికీ టీడీపీ: ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు..

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం విరామం తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను గణాంకాలతో సహా తెలియజేశారు. ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మరోవైపు, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఆదివారం కూడా విశేష ఉత్సాహంతో పాల్గొనడం, ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని లోకేశ్ అన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం.. యువతకు ప్రధాని మోదీ పిలుపు



దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్.. కోర్టులో హాజరు

(మొదటి పేజీ తరువాయి)

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

**అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ**

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరామకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్కులను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

**ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం**

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

(మొదటి పేజీ తరువాయి)



మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు. చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్కులను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. "అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం'

# ఆరు నెలల యుద్ధానికి ముగింపు?..



ఆరు నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌పై జరప తలపెట్టిన భారీ సైనిక దాడిని విరమించుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీనికి బదులుగా సోమవారం (ఆగస్టు 3) నుంచి ఇరాన్‌తో కొత్తగా చర్చలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఈ చర్చల్లో ప్రధానంగా హర్మూజ్ జలసంధి వివాదం, ఇరాన్ అణు నిరాయుధీకరణ అంశాలపై దృష్టి సారిస్తామని ఆదివారం ట్రంప్ విలేకరులకు చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ట్రంప్ తాజా ప్రకటనతో సోమవారం ఆసియా మార్కెట్లు ప్రారంభమైన వెంటనే చమురు ధరలు తగ్గాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ ధర 4.7 శాతం తగ్గి 80.72 డాలర్లకు పడిపోయింది. గత నెలలో దాడులు తిరిగి ప్రారంభమవడంతో యుద్ధం మళ్లీ తీవ్రమవుతుందనే ఆందోళనలు పెరిగాయి. ఇరాన్‌పై 'చాలా కఠినంగా' దాడి చేస్తామని, ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అయితే, శనివారం ఆయన వెనక్కి తగ్గి, ఒప్పందానికి కావాల్సిన 'పరిమితులు' ఉన్నాయని పేర్కొన్నారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి మిత్రదేశాలతో పాటు, ఇరాన్ కూడా దాడిని నిలిపివేయాలని తనను కోరిందని ట్రంప్ చెప్పారు. అయితే, ట్రంప్‌ను తాము అలాంటిదేమీ కోరలేదని ఇరాన్ మీడియా ఖండించింది. ఇదిలా ఉండగా, జూన్‌లో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నారని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిషన్ ప్రతినిధి హసన్ ఘష్ఘవి తెలిపారు. "శత్రువు సంతకం చేసిన దానికి కట్టుబడి ఉండేలా మనం ఒత్తిడి తీసుకురావాలి" అని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, చర్చల ప్రకటన వచ్చినప్పటికీ, ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదు. ఆదివారం ఒమన్ తీరంలో ఒక ట్యాంకర్ సమీపంలో పేలుడు శబ్దం వినిపించినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ నివేదించింది. సిబ్బంది, నౌక సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది.

# ‘ప్రైవేటు’కు గుడ్ బై.. సర్కారు బడికి సై!

- మల్లగూడెం గ్రామస్తుల సమిష్టి నిర్ణయం
- ఊరి నుంచి ప్రైవేటు స్కూళ్లకు జీరో అడ్మిషన్లు
- అందరి సహకారంతో సాధించిన ఘనత
- పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకే పంపుతూ గ్రామస్తుల ఏకగ్రీవ నిర్ణయం



**తొలివెలుగు, రాజాపేట:** ఆ గ్రామం చిన్నదే అయినా.. ఆలోచనలో మాత్రం జిల్లాకే ఆదర్శంగా నిలిచింది. ‘ప్రైవేటు బడి వద్దు – ప్రభుత్వ బడి ముద్దు’ అనే నినాదాన్ని నిజం చేస్తూ మల్లగూడెం గ్రామస్తులు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి సరికొత్త స్ఫూర్తికి నాంది పలికారు. ఈ విద్యా సంవత్సరంలో గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు బడికి వెళ్లడం లేదని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోత్ శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఇదొక శుభపరిణామమని ఆయన అన్నారు. గ్రామ సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్ రెడ్డి, కార్యదర్శి చక్రధారి, ఎంఈఓ చందా రమేష్, రాజాపేట కాంప్లెక్స్ తడ్క రాజు, ఉప సర్పంచ్ రెడ్డబోయిన కవితల కృషితో పాటు.. వార్డు సభ్యులు నీల కనకమ్మ, గొడుగు భ్రమయ్య, నీల జహంగీర్, గొడుగు కల్పన, బోయిని నాగరాజ్, ఉపాధ్యాయుడు ఉదయ్ కుమార్, ఏఏపీసీ చైర్మన్ రెడ్డబోయిన పోషమ్మ, అంగన్వాడీ టీచర్ మాలి అరుణల సహకారం మరువలేనిదన్నారు. పాఠశాల దాతలు, మాజీ సర్పంచ్ గొడుగు రాజు, ఉప సర్పంచ్ జెన్నపల్లి కవిత రవీందర్ రెడ్డి, రెడ్డబోయిన రాజు, గ్రామ ప్రజల సమిష్టి కృషితోనే ఈ అద్భుత ఫలితం సాధ్యమైందని, ఇది మండలానికే కాదు జిల్లాకే గర్వకారణమని వారు కొనియాడారు.

# కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి
- డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత



**తొలివెలుగు, రాజాపేట:** దళితులకు చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను రాజాపేట మండల కేంద్రంలో ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. దళితుల అభ్యున్నతి కోసం ప్రకటించిన హామీల అమలులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. దళిత కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఇచ్చిన అన్ని వాగ్దానాలను తక్షణమే నెరవేర్చాలన్నారు. దళితులకు భూమి, గృహాలు, ఉపాధి, విద్య, సంక్షేమ పథకాల అమలుతో పాటు సబ్‌ప్లాన్ నిధులను సమర్థంగా వినియోగించి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఫలాలు అందేలా చూడాలని కోరారు. జిల్లా ప్రజలు, దళిత సంఘాల నాయకులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం, మల్లేశం, పోచయ్య, ఇంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పెంట గోపాల్

# ఏకగ్రీవంగా నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక

- 30న శ్రావణ మాస బోనాల నిర్వహణకు తీర్మానం

తొలివెలుగు, రాజాపేట: ాజాపేట మండలంలోని బేగంపేట పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పెంట గోపాల్, ఉపాధ్యక్షుడిగా చెడదీపు వర్ధేష్, ప్రధాన కార్యదర్శిగా చిన్నం బాలస్వామి, కోశాధికారిగా బోగా కమలాకర్ తదితరులు ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు చర్చించారు. సంఘం ఆధ్వర్యంలో కమిటీ హాల్ నిర్మాణాన్ని త్వరలో చేపట్టాలని నిర్ణయించారు. అలాగే, ఈ నెల 30వ తేదిన గ్రామంలో శ్రావణ మాస బోనాలు ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు భోగ హరినాథ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సీపీఎం సమరం

- అమెరికా విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు: చెరుపల్లి సీతారాములు
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల నిర్లక్ష్యం తగదు: ఎండీ జహంగీర్
- రామన్నపేటలో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు




**తొలివెలుగు, రామన్నపేట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రామన్నపేట మండల కేంద్రంలోని ఎంజీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల రెండో రోజు కార్యక్రమంలో ఆ పార్టీ అగ్రనేతలు పలు కీలక అంశాలపై ప్రసంగించారు. ‘ప్రస్తుత రాజకీయ పరిణామాలు’ అనే అంశంపై మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా చమురు సంపద కలిగిన దేశాలపై ఆధిపత్యం సాధించేందుకు అమెరికా పన్నుతున్న కుట్రలు, విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు ప్రధాని నరేంద్ర మోదీ తలొగ్గారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసరాల ధరలతో రైతులు, కార్మికులపై తీవ్ర భారం పడుతోందన్నారు. దేశ ప్రజల ప్రయోజనాలు, ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణకు వామపక్ష శక్తులు బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ‘రాష్ట్ర రాజకీయ పరిస్థితులు – ప్రజా సమస్యలు’ అనే అంశంపై రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో మౌలిక వసతులు, సిబ్బంది, మందుల కొరత తీవ్రంగా ఉన్నట్లు వెల్లడైందన్నారు. వెంటనే ఖాళీలను భర్తీ చేసి ఎన్నికల హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ తరగతులకు బొడ్డుపల్లి వెంకటేశం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నర్సింహాచారి, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, జంపాల అండాలు, గొరిగే సోములు, గన్నెబోయిని విజయభాస్కర్, నాగటి ఉపేందర్, ఎండీ రషీద్, బావండ్లపల్లి బాలరాజు, ఆవనగంటి నగేష్, తొర్పునూరి శ్రీనివాస్, మేడి గణేష్, అంబటి మల్లారెడ్డి, మునికుంట్ల లెనిన్, పులి బిక్షం, ఆవనగంటి రవీందర్, గంగాదేవి మల్లేష్, అప్పం సురేందర్, మెట్టు శ్రవణ్ కుమార్, మేడి ముకుంద, శానాగొండ రాము, పుట్టల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల్లో జిల్లాకు మొండిచెయ్యి

- 317 జీవోతో స్థానిక నిరుద్యోగులకు తీవ్ర నష్టం
- ఖాళీలు గుర్తించి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలన్న ఏఐవైఎఫ్
- నూతన మండల అధ్యక్షుడిగా కళ్లెం స్వామి




**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాకు ఖాళీలు కేటాయించకపోవడం స్థానిక నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేయడమేనని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు విమర్శించారు. రామన్నపేటలో ఎర్ర రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఏఐవైఎఫ్ 12వ మండల నిర్మాణ మహాసభలో జిల్లా అధ్యక్షుడు ఏల్లంకి మహేష్, జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 29న విడుదలైన పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి జిల్లాలో ఒక్క ఖాళీ కూడా చూపకపోవడం ఆందోళనకరం అన్నారు. 317 జీవో అమలు సమయంలో ఇతర జిల్లాలకు చెందిన కానిస్టేబుళ్లను యాదాద్రికి కేటాయించారని, జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత కూడా వారిని స్థానిక కేడర్లకు బదిలీ చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వెంటనే వారిని బదిలీ చేసి, వాస్తవిక ఖాళీలతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద యువతపై జరిగిన లాఠీచార్జిపై విచారణ జరపాలన్నారు. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించే ఏఐవైఎఫ్ యువజన ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**నూతన కమిటీ ఎన్నిక:**

అనంతరం ఏఐవైఎఫ్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కళ్లెం స్వామి, ఉపాధ్యక్షుడిగా వినయ్, ప్రధాన కార్యదర్శిగా రచ్చ దయాకర్, సహాయ కార్యదర్శిగా కొత్త లింగస్వామి, కోశాధికారిగా ఊట్కూరి శ్రీను ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నయీం, కోశాధికారి సాయి, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, పాండు, గాలయ్య, నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

# స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ఉద్యమం తప్పదు

- చౌటుప్పల్ పరిశ్రమల తీరుపై ఏఐవైఎఫ్ ఆగ్రహం
- వనరులను దోచుకుంటూ యువతకు మోసం చేస్తున్నారని మండిపాటు
- ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో ఆదివారం నిర్వహించిన ఏఐవైఎఫ్ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంవత్సరాలుగా ఇక్కడి నిరుద్యోగులు ఉద్యమాలు చేస్తున్నా పరిశ్రమల్లో స్థానికులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. దివిస్ లాంటి పెద్ద పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగులు ఉన్నా స్థానికులకు మాత్రం మొండిచెయ్యి చూపుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో సహజ వనరులను కొల్లగొడుతూ, వ్యవసాయ పంటలను, తాగునీటిని పరిశ్రమలు కలుషితం చేస్తున్నాయని ఆరోపించారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువత ఉపాధి లేక మనోవేదనకు గురవుతుంటే, స్థానిక ప్రాంతంలోనే బోలెడు కంపెనీలు ఉన్నా ఉద్యోగం కోసం బయట ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా అధికారులు తనిఖీ చేయడం లేదన్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తూ స్థానిక యువతకు ఉపాధి కల్పించకపోతే భవిష్యత్తులో తీవ్ర తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ ఉద్యమ స్ఫూర్తితో యువత ఉద్యోగాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ అధ్యక్షుడు బద్దుల సుధాకర్, మండల కన్వీనర్ ఉడుత రాజు, నాయకులు బరిగెల వేణు, గుండెబోయిన భాస్కర్, బద్దుల సాయితేజ, టంగుటూరు కిరణ్ కుమార్, నీళ్ల రాము, భాను తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో యాదాద్రికి అన్యాయం!

- జీవో 317 లోపాలతోనే జిల్లా నిరుద్యోగులకు నష్టం: ఏఐవైఎఫ్
- ఇతర జిల్లాల కానిస్టేబుళ్ల బదిలీకి డిమాండ్.. వలిగొండలో సభ



**తొలివెలుగు, వలిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు మండిపడ్డారు. వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం మేడి దేవేందర్ అధ్యక్షతన ఏఐవైఎఫ్ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ.. గత జూలై 29న ప్రభుత్వం ప్రకటించిన పోలీసు నోటిఫికేషన్‌లో కోడ్ నెంబర్ 21 (సివిల్ కానిస్టేబుల్), కోడ్ నెంబర్ 22 (ఏఆర్ కానిస్టేబుల్) జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లాకు ఒక్క ఖాళీ కూడా కేటాయించకపోవడంపై జిల్లా నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. 2021 డిసెంబర్‌లో వచ్చిన జీవో 317 ప్రకారం నాటి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి జిల్లాకు నల్లగొండ, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి పలువురు కానిస్టేబుళ్లు కేటాయించబడ్డారని, ఆ కేటాయింపులు పారదర్శకంగా జరగలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి యాదాద్రి జిల్లాను రాచకొండ కమిషనరేట్ పరిధి నుండి వేరు చేసి ఆరు నెలలు గడుస్తున్నా.. ఇతర జిల్లాలకు చెందిన కానిస్టేబుళ్లను వారి సంబంధిత స్థానిక కేడర్లకు ఎందుకు బదిలీ చేయలేదని ప్రశ్నించారు. దీనివల్ల నల్లగొండ, సూర్యాపేట జిల్లాలలో భారీగా ఖాళీలు ఏర్పడగా, యాదాద్రి జిల్లాలో మాత్రం సున్నా ఖాళీలు చూపించి స్థానిక యువతకు మొండిచెయ్యి చూపారన్నారు. వెంటనే ఇతర జిల్లాల నుంచి వచ్చిన కానిస్టేబుళ్లను సొంత కేడర్లకు బదిలీ చేసి, వాస్తవిక ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్‌ను సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ నయీమ్, వలిగొండ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, సహాయ కార్యదర్శి గుండెగాని నాగరాజు, మండల ఉపాధ్యక్షులు కనకబోయిన నందు, కార్యవర్గ సభ్యులు సంఘీ కృష్ణ, కన్నెబోయిన శివసాయి, ఫణీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువైన అగ్రసేన్ బ్యాంక్ సేవలు

- కొత్తపేటలో 14వ శాఖను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- అధునిక వసతులతో కూడిన సేవలను వినియోగించుకోవాలని పిలుపు
- ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యం: చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా




**తొలివెలుగు, ఎల్‌బీ నగర్/కొత్తపేట:** తెలంగాణలో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించాలనే లక్ష్యంతో అగ్రసేన్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ తన 14వ శాఖను ఆదివారం కొత్తపేటలో ఘనంగా ప్రారంభించింది. కొత్తపేట లక్ష్మీనగర్ కాలనీ 'ఎక్స్' రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ నూతన శాఖను ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా అధ్యక్షత వహించారు.



**సేవలను సద్వినియోగం చేసుకోవాలి:**

ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా మాట్లాడుతూ.. కొత్తపేట శాఖ ప్రారంభంతో బ్యాంకు శాఖల సంఖ్య 14కు చేరిందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా నాణ్యమైన, ఆధునిక బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించేందుకు బ్యాంకు కట్టుబడి ఉందని తెలిపారు. ఆకర్షణీయమైన డిపాజిట్ పథకాలు, వివిధ రకాల రుణ సౌకర్యాలు, సాంకేతికత ఆధారిత బ్యాంకింగ్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నూతన శాఖలో 24 గంటల ఏటీఎం సౌకర్యం, సేఫ్ డిపాజిట్ లాకర్లు, ఇతర ఆధునిక బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ చైర్మన్ సీఏ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ చైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ నారాయణ్ దత్, జనరల్ మేనేజర్ ఒ సీఈఓ సి.వి. రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆనంద్ అగర్వాల్, శాఖ మేనేజర్ జ్యోతి రాఠీ, డైరెక్టర్లు, అధికారులు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నేస్తం' నూతన అధ్యక్షుడిగా పేరబోయిన సోమయ్య

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం: నూతన కమిటీ

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేటలోని నేస్తం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గ వివరాలను సంఘం ప్రతినిధులు వెల్లడించారు. సంఘం అధ్యక్షుడిగా పేరబోయిన సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా కదవేరుగు సోమేశ్, కోశాధికారిగా ఆడెపు నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ సభ్యులు, నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన మచ్చ శ్యామల మృతి పట్ల గ్రామ సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బొమ్మగాని పరమేష్ గౌడ్ ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలికి నివాళులర్పించిన వారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఉపసర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు బొమ్మగాని పరమేష్ గౌడ్ మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎల్దండి ప్రభాకర్, మచ్చ యాదగిరి, చుక్క యాదయ్య, ఈరుకు పెంటయ్య, ఈరుకు తిరుమలేష్, లింగస్వామి, పరమేష్, ఇస్తారి లింగస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గోస్కొండలో కన్నుల పండువగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- ప్రజలు సుభిక్షంగా ఉండాలని మహంకాళి తల్లిని ప్రార్థించిన ఎమ్మెల్యే

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం భూదాన్ పోచంపల్లి మండలంలోని గోస్కొండ (బోస్కొండ) గ్రామంలో ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గ్రామ సర్పంచ్‌తో కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి నిర్వహించిన బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలాంటి కరువు కాటకాలు లేకుండా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పప్పు నూతన వెంకటేశ్ యాదవ్, పోచంపల్లి పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, నాయకులు సామ మోహన్ రెడ్డి, మరి నరసింహారెడ్డి, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, పడమటి భూపాల్ రెడ్డి, కొట్టం కరుణాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాసుల అంజయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు దోసపాటి రవి, శ్రీనివాస్, గురు ప్రభాకర్, పడాల సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.



## ఈవో ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నా: సర్పంచ్ నిరంజన్ గౌడ్

- ఆందోళ్ మైసమ్మ బోనాల మహోత్సవంలో ప్రోటోకాల్ విస్మరణ
- అధికార పార్టీ నేతలకు ఏజెంట్‌గా మారుతున్నారని మండిపాటు
- ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవస్థానంలో ఇటీవల జరిగిన బోనాల మహోత్సవంలో దేవస్థానం ఈవో వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. ఈవో అధికార పార్టీ నేతలకు ఏజెంట్‌గా మారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని దండుమల్కాపురం గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఈవో తీరును తీవ్రంగా ఖండించారు. గ్రామంలోని ప్రసిద్ధ ఆందోళ్ మైసమ్మ బోనాల మహోత్సవ వేడుకలకు దేవస్థానం ఈవో కనీసం గ్రామ సర్పంచ్‌నైన తనను ఆహ్వానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా, దేవస్థానం ఉన్న గ్రామ ప్రథమ పౌరుడిగా ఉన్న తనకు బోనాల ఆహ్వాన పత్రికలో కనీస గౌరవ హోదా కూడా కల్పించకుండా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వ పదవిలో ఉంటూ ప్రజాస్వామ్య మర్యాదలను, అధికారిక ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి, అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈవో పనిచేస్తున్నారని ఆరోపించారు. గ్రామ ప్రజల ఓట్లతో గెలిచిన సర్పంచ్‌ను పూర్తిగా విస్మరించి ఇతరులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం ఏ ప్రామాణికం కిందకి వస్తుందో ఈవో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.





## నాటి జ్ఞాపకాలతో ప్రగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- వలిగొండలో ఘనంగా 1993--95 బ్యాచ్ వేడుక
- పాల్గొన్న విద్యాసంస్థల స్థాపకులు, లెక్చరర్లు, విద్యార్థులు

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ పట్టణంలోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రగతి జూనియర్ కళాశాల 1993–95 ప్రథమ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రగతి విద్యాసంస్థల స్థాపకులు, లెక్చరర్లు, వివిధ గ్రూపులకు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ విద్యార్థి దశలోని అనుభవాలు, అధ్యాపకుల బోధనాశైలి, అంతులేని స్నేహబంధాలను స్మరించుకున్నారు. దశాబ్దాల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఇటువంటి సమ్మేళనాలు పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సమ్మేళనాన్ని 1993–95 పూర్వ విద్యార్థుల నిర్వహణ కమిటీ అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కాసుల వెంకన్న గౌడ్, పబ్బు వెంకటరమణ గౌడ్, గంధ మల్లస్వామి రాజ్, పైల ప్రకాష్, మల్లం వెంకటేష్, జగదీశ్వర్, నూతనగంటి వెంకటేష్, వెల్లంకి శ్యాంసుందర్, సత్యనారాయణ గట్టు, పబ్బు శ్రీలత, పందిరి రమ, పందిరి రజిత, చిట్టెడి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మంకాలమ్మ బోనాల పండుగ

**ఊరేగింపులో అలరించిన పోతురాజుల విన్యాసాలు**

**మహేశ్వరం ప్రతినిధి** మహేశ్వరం మండల పరిధిలో ఉన్న పలు గ్రామాలలో మంకాలమ్మ బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయము 4 గంటలకు అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి సుప్రభాత సేవతో పూజల ప్రారంభించారు.ఆలయానికి రంగురంగు పువ్వులతో అలంకరించారు ఉదయం 10 గంటలనుండి గ్రామ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు సాయంత్రం 5 గంటలకు అమ్మవారికి ఘటాల ఊరేగింపు చేశారు ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు భక్తులను అలరింపజేశాయి గ్రామ పెద్దలు యువకులు,ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గాయపడిన కాంగ్రెస్ కార్యకర్తకు ఆర్థిక చేయూత

- పరామర్శించి సాయం అందించిన కాంగ్రెస్ నాయకులు
- అన్నివేళలా అండగా ఉంటామని భరోసా

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాతరాజు రమేష్ ఇటీవల కాలుకు గాయమై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ఆదివారం ఆయనను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వర్కాల రాము గౌడ్ రమేష్‌ను స్వయంగా కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు ఆర్థిక సాయం అందజేసి, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రమేష్ త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పబ్బు సత్యం, గుర్రం శ్రీనివాస్ నేత, ఐఎన్టీయూసీ చౌటుప్పల్ మండల బ్లాక్ అధ్యక్షుడు కంచర్ల జంగయ్య, వెల్లూరి రాజేష్, బషీర్, వర్కాల ప్రసాద్, మధు, నరసింహ తదితరులు పాల్గొన్నారు. వారు రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.





# అగస్ట్ 10న దేశవ్యాప్త 'జైల్ భరో'ను జయప్రదం చేయాలి

- కేంద్ర కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై సీఐటీయూ పిలుపు
- చౌటుప్పల్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం



**తొలివెలుగు, చౌటుప్పల్:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్ట్ 10న చేపట్టనున్న దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి భవనంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎండీ పాషా అధ్యక్షతన ఆదివారం మండల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కల్లూరి మల్లేశం, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగదేవి సైదులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచడం, హైర్ అండ్ ఫైర్ విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లు-2025ను రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ కోత పెట్టే కుట్రలను తిప్పికొట్టాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో కదిలివచ్చి జైల్ భరోను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు గోశిక కరుణాకర్, ప్రజా సంఘాల నాయకులు చీరిక సంజీవరెడ్డి, ఆకుల ధర్మయ్య, బొడ్డు అంజిరెడ్డి, చింతల సుదర్శన్, చిమకండ్ల శ్రీరాములు, బత్తుల దాసు, కాలకుంట్ల శివ, జొన్నగంటి దేవయ్య, యాట బాలరాజు, రాపోలు పద్మ, చెరుకు లక్ష్మమ్మ, శ్రీనివాస్ రెడ్డి, యాట ముత్యాలు, పబ్బతి పుల్లయ్య, తూర్పు నూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, ఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శివరాంపల్లిలో గోదాంలో అగ్నిప్రమాదం, ప్రాణనష్టం లేదు

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి వీకర్ సెక్షన్ ప్రాంతంలోని ఓ గోదాంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల 36 నిమిషాలకు శివరాంపల్లి వీకర్ సెక్షన్ ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగినట్లు డయల్ 100 కు సమాచారం అంది. వెంటనే అత్తాపూర్ పోలీస్ స్టేషన్ కు చెందిన పి.వి.2 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక శాఖకు వెంటనే సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకున్నారు. అధికారుల ఆదేశాలతో సిబ్బంది శరవేగంగా చర్యలు చేపట్టి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. గోదాంలోని వస్తువులు పాక్షికంగా దగ్ధమైనట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.



# వైభవంగా ఆందోళ్ మైసమ్మ బోనాలు





**ఘనంగా చండీ హోమం, రథోత్సవం**

- అమ్మవారికి సర్కార్ బోనం సమర్పించిన చైర్మన్ అశ్వినిరెడ్డి, ఈవో మోహన్‌బాబు
- పోటెత్తిన భక్తులు.. ఏర్పాట్లు పరిశీలించిన ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవాలయంలో 21వ వార్షిక బోనాల ఉత్సవాలు ఆదివారం నేత్రపర్వంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ ఆందోళ్ మైసమ్మ తల్లి, ఉప్పలమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి, కార్యనిర్వాహణాధికారి (ఈవో) సల్వాది మోహన్ బాబు అమ్మవారికి ప్రభుత్వ లాంఛనాలతో 'సర్కార్ బోనం' సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఉత్సవానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దాత కొమిరిశెట్టి విజయ్ కుమార్ - శిరీష దంపతులు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ ఆధ్వర్యంలో పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి, వరుస క్రమంలో దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఈడుదుల బాబు, బేతాళ నరసింహ, సిద్దిపేట ఆనందరెడ్డి, వెంకిర్యాల శివ, బాలగోని శ్రీకాంత్ గౌడ్, బొంతల యువరాజ్, మన్నే మహేందర్ రెడ్డి, దౌడీ రాజేష్ పన్నాల, మహేందర్ రెడ్డి, ధేప రాజీవ, పంతంగి రమేష్, జొన్నగంటి దాసు, చిట్టెంపల్లి సబిత, వల్లూరి శివప్రసాద్ శర్మతో పాటు పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.





# బోనమెత్తిన లష్కర్..



బేగంపేట్, ఆగస్టు 2: లష్కర్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు ఆదివారం వైభవంగా జరిగాయి. బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం 3.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం సమర్పించారు. అనంతరం 4.05 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు అనుమతి ఇచ్చారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించి, దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోనాల సందర్భంగా దేవదాయ శాఖ భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేసింది. పోలీసులు భక్తుల భద్రత కోసం భారీ బందోబస్తు చేశారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రధానంగా అమెరికన్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ అమ్మవారికి బోనం సమర్పించారు. గద్దర్ కూతురు వెన్నెల, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సతీమణి అమ్మవారికి బోనం సమర్పించారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి భక్తులు అధికంగా రావడంతో అమ్మవారి ఆలయం ఆర్చిగేట్ ద్వారా వీఐపీల దర్శనానికి అనుమతిచ్చారు. దేవాలయానికి వీఐపీలు వచ్చి దర్శనం చేసుకునే సమయంలో భక్తులను బోనాల క్యూలైన్‌లో అరగంట పాటు నిలిపివేయడంతో అసహనానికి గురయ్యారు. బోనాలతో వచ్చిన మరికొంతమంది భక్తులు క్యూలైన్‌లో స్పృహ తప్పి పడిపోయారు. వారికి అప్పటికప్పుడు వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. ప్రధానంగా ఆర్చిగేట్ నుంచి అనుమతించిన శివసత్తుల బోనాలను తీసుకొచ్చే క్రమంలో పలువురి బోనాలు సైతం కిందపడిపోయాయి. ఇది బోనాల చరిత్రలోనే మొదటిసారని భక్తులు భావిస్తున్నారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు వివిధ సేవా సంస్థల వాలంటీర్లు మంచినీటిని అందించి దర్శనం చేసుకునేందుకు సహకరించారు. ఉత్తర మండలం పోలీసులు డీసీపీ రక్షిత మూర్తి నేతృత్వంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేపట్టారు. భారీ బందోబస్తే నడుమ జాతర ఉత్సవాలు విజయవంతమయ్యాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దర్శించుకున్నారు. అలాగే మంత్రి సీతక్క, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, శ్రీగణేష్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ హనుమంతరావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కలెక్టర్ ప్రయాంక, పలువురు జడ్జీలు, అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా భక్తులు, మహిళల బోనాలతోపాటు, శివసత్తులు సమర్పించే బోనాలు ఆకర్షణీయంగా తయారు చేశారు. వాటిని డప్పు చప్పుళ్లు, బాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకొచ్చి మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలతో మహిళలు ఈ సారి రెట్టింపు సంఖ్యలో వచ్చినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. కానీ దేవాలయం వద్ద గతంతో పోలిస్తే తోపులాట కూడా అధికంగా కనిపించింది. పోలీసులు వారిని కంట్రోల్ చేసేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.





## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'? ఆగస్టు 5న కీలక నిర్ణయం

**రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకోనున్న కాక్రోచ్ జనతా పార్టీ**

**ఆగస్టు 5న అభిజీత్ దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ సమావేశం**

**నీట్ పేపర్ లీక్ నిరసనల విజయంతో ఉద్యమ సంస్థపై పెరిగిన అంచనాలు**

**ఉద్యమంగానే కొనసాగాలా లేక పార్టీ పెట్టాలా అనే దానిపై స్పష్టత**

**సమావేశం తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించనున్న అభిజీత్ దీప్కే**

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు

**హైడ్రాకు సంఘీభావం తెలుపుతూ నగరంలో పలు సంక్షేమ సంఘాల ర్యాలీలు**

**వరద కట్టడి, చెరువుల పరిరక్షణ చర్యలను స్వాగతించిన నగరవాసులు**

**రెండేళ్లలో రూ. 1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిందని ప్రశంసలు**

**సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తూ.. హైడ్రాను కొనసాగించాలని డిమాండ్**

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి**

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగళ్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి. గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు. కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు.



# రాయల్ ఛాలెంజ్, యాంటిక్విటీ విస్కీ అమ్మకాలపై నిషేధం

## కృత్రిమ ఫ్లేవర్లు వాడుతున్నట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

## రాయల్ ఛాలెంజ్, యాంటిక్విటీ సహా పలు బ్రాండ్లపై వేటు

పాత స్టాక్ అమ్మకాలకు షరతులతో కూడిన అనుమతి



వినియోగదారులను తప్పుదారి పట్టించేలా కృత్రిమ ఫ్లేవర్లు వాడుతున్నారన్న ఆరోపణలతో ప్రముఖ విస్కీ, రమ్ బ్రాండ్ల అమ్మకాలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిషేధం విధించింది. డియాజియోకు చెందిన యునైటెడ్ స్పిరిట్స్, ఇన్‌బ్రూ బేవరేజెస్ సంస్థలు తయారుచేస్తున్న ఎంపిక చేసిన ఉత్పత్తులపై ఈ చర్యలు తీసుకుంది. మధ్యప్రదేశ్‌లో యునైటెడ్ స్పిరిట్స్ తయారుచేస్తున్న యాంటిక్విటీ బ్లూ విస్కీ, రాయల్ ఛాలెంజ్ విస్కీతో పాటు, ఇన్‌బ్రూ బేవరేజెస్ ఉత్పత్తి చేస్తున్న బ్యాగ్‌పైపర్ డీలక్స్ విస్కీ, ఓల్డ్ కాస్క్ డీలక్స్ ట్రిపుల్ ఎక్స్ రమ్‌ల అమ్మకాలను నిలిపివేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. కొన్ని కంపెనీలు విస్కీ, రమ్‌ల తయారీలో ముడిసరుకులు, నిల్వ ప్రక్రియ ద్వారా సహజంగా రుచి, సువాసనను అభివృద్ధి చేయడానికి బదులుగా, బయటి నుంచి ఫ్లేవర్లను వాడుతున్నట్టు తమ తనిఖీల్లో తేలిందని ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరించింది. ఇది వినియోగదారులను ఉత్పత్తి నాణ్యత విషయంలో మోసగించడమేనని పేర్కొంది. ఈ నిషేధాన్ని సవాలు చేసిన రెండు తయారీ సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ పాక్షిక ఉపశమనం కల్పించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న స్టాక్‌ను అమ్ముకోవడానికి షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. అయితే, బాటిళ్ల ముందు భాగంలో వినియోగదారులకు స్పష్టంగా తెలిసేలా సవరించిన లేబుల్స్ అతికించాలని స్పష్టం చేసింది. యునైటెడ్ స్పిరిట్స్ దేశంలోనే అతిపెద్ద మద్యం తయారీ సంస్థ కాగా, ఇన్‌బ్రూ బేవరేజెస్ కూడా అగ్రగామి కంపెనీలలో ఒకటి. ఆహార, పానీయాల ప్రమాణాల విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ తన పర్యవేక్షణను కఠినతరం చేస్తోందని ఈ తాజా చర్యలు సూచిస్తున్నాయి.

# దేశంలో రుతుపవనాల వింత పోకడ.. ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!


**దేశంలో అసమానంగా విస్తరించిన రుతుపవనాలు**

**జాతీయ స్థాయిలో 11 శాతం వర్షపాత లోటు నమోదు**

**పశ్చిమ భారత్‌లో దట్టమైన మేఘాలు.. ఉత్తరాదిన నిర్మలమైన ఆకాశం**

**ఉపగ్రహ చిత్రాల ద్వారా రుతుపవనాల వ్యత్యాసాన్ని చూపిన ఐఎండీ**

**ఆగస్టు 3 నుంచి ఉత్తర భారతంలో వర్షాలు మెరుగుపడే అవకాశం**



దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. ప్రస్తుతం గుజరాత్, దాని పరిసర ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న వాతావరణ వ్యవస్థ కారణంగా అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, వాయువ్య భారతదేశంలో రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నాయి. అయితే, రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు కదిలే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆదివారం (ఆగస్టు 2) నుంచి ఢిల్లీ, హర్యానా, పంజాబ్, యూపీల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆగస్టు 3 నుంచి 5 మధ్య వర్షాలు పుంజుకుని, 40 నుంచి 70 శాతం ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు (40-100 మి.మీ.) కురవొచ్చని తెలిపింది. మరోవైపు, దక్షిణ, మధ్య రాజస్థాన్‌లో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. మొత్తం మీద, కొన్ని పశ్చిమ ప్రాంతాలు వరదలతో సతమతమవుతుండగా, ఉత్తరాది ప్రాంతాలు విస్తారమైన వర్షాల కోసం ఇంకా ఎదురుచూస్తున్నాయి.

# గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు



ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దకోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

# ఈసారి వడ్డీరేట్లు యథాతథమే.. ద్రవ్యోల్బణ గణాంకాలే కీలకం!



ముంబై, ఆగస్టు 2 : వడ్డీరేట్లు తగ్గుతాయి..ఆర్థిక ఉపశమనం కలుగుతుందని ఆశించిన వారికి ఈసారి కూడా నిరాశే ఎదురుకావచ్చు. రిజర్వుబ్యాంక్ ఆగస్టు నెల ద్రవ్యపరపతి సమీక్షలోనూ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవని అత్యధిక మంది ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తన ఆగస్టు సమీక్ష ఈ నెల 3న ప్రారంభమై 5న నిర్ణయాన్ని ప్రకటించనున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో క్రూడాయిల్ ధరలు ఇంకా గరిష్ఠ స్థాయిలోనే కదలాడుతుండటం, దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ధరల సూచీ రివ్వున ఎగిసింది. దీంతో వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను యథాతథ స్థితికే సెంట్రల్ బ్యాంక్ మొగ్గుచూపే అవకాశాలున్నాయని పది మంది ఆర్థికవేత్తలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి ఎగబాకడంతో ఆర్బీఐ ప్రస్తుతం వేచి చూసే దోరణి అవలంబించవచ్చునని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను సెంట్రల్ బ్యాంక్ 5.1 శాతానికి పెంచిందని, నిజానికి ద్రవ్యోల్బణం అదుపునకు సంబంధించి ఆర్బీఐ లక్ష్యం 4 శాతంగా పెట్టుకున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దీనిని సవరించింది. ఆహారోత్పత్తులు రివ్వున దూసుకెళ్లడంతో ఆర్బీఐకి వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయం సన్నగిల్లిందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ..ద్రవ్యోల్బణం నియంత్రించడమే తమ ప్రధాన లక్ష్యమని, దేశవ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సానుకూల వర్షాలు కురుస్తుండటంతో భవిష్యత్తులో తగ్గే అవకాశం కూడా ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. గడిచిన ఏడాదికాలంలో రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను 1.25 శాతం వరకు తగ్గించిన విషయం తెలిసిందే. దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడంలో వర్షాలది కీలకపాత్రని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో ఎక్కువమంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల భారీగాను, మరికొన్నిచోట్ల ఆశించిన స్థాయిలో కురువడం లేదని ఒకింత ఆందోళన వెలిబుచ్చారు. మరోవైపు, దేశ వృద్ధిరేటు భారీగా పుంజుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదని వారు అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోవడం, ఇంధన ధరలు భగ్గుమనడం, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా వృద్ధికి బీటలు పడే అవకాశాలు మెండుగావున్నాయన్నారు. అలాగే ద్రవ్యోల్బణం ముప్పు, వడ్డీరేట్ల పెరుగుదల, కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు క్షీణత, నిరుద్యోగం వంటి సమస్యలకు దారితీస్తున్నది. మరోవైపు ఎల్ నినో కారణంగా ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలు కనిపించడం లేదు. ఇదే జరిగితే పంటల సాగు, దిగుబడి ప్రభావితమై ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్నంటే వీలున్నది. ఆర్బీఐ ఇప్పుడు ఈ అంశాలపైనే ఆందోళన చెందుతున్నది.



## ఐటీలో కొత్త ఉద్యోగాలు కష్టమే.. జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 : ఏఐ, డాటా సెంటర్ మౌలిక సదుపాయాల వ్యయం విపరీతంగా పెరుగడంతో ఐటీ పరిశ్రమలో కొత్త ఉద్యోగాల సృష్టి తగ్గిందని జోహో కార్పొరేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితులను భారత్ కూడా ఎదుర్కొంటున్నదని అభిప్రాయపడ్డారు. కొత్త ఉద్యోగాల కోసం పెట్టే ఖర్చును కార్పొరేట్ సంస్థలు ప్రస్తుతం ఏఐ, సర్వర్లు, మెమోరీ ధరల పెరుగుదల వల్ల డాటా సెంటర్ల వ్యయాలకు కేటాయిస్తున్నాయన్నారు. ఏఐ టెక్నాలజీ సేవలు అందిస్తున్న సంస్థలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నాయని, ఆ వ్యయానికి తగ్గట్టుగా లాభాలు ఆశిస్తున్నాయో తెలియడం లేదన్నారు. ఆటోమేషన్ వల్ల తయారీ రంగం కూడా భారీ స్థాయిలో ఉద్యోగాలను సృష్టించలేకపోతున్నదన్నారు.

## 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. గడిచిన నెలకుగాను రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.83 లక్షల కోట్లతో పోలిస్తే 15.4 శాతం అధికంగా. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్లకు పైగా వసూలు కావడం ఇది రెండోసారి కావడం విశేషం. జూన్ నెలకుగాను రూ.1.95 లక్షల కోట్లు వసూలయ్యాయి. అమ్మకాలు, దిగుమతుల ద్వారా సమకూరే ఆదాయం, దేశీయ వినియోగం నిలకడగా ఉండటం వల్లనే జీఎస్టీ వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొంది. జూలై నెలలో వసూలైన జీఎస్టీలో దేశీయంగా రూ.1.44 లక్షల కోట్లు వసూలవగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్నుతో రూ.66,511 కోట్ల నిధులు సమకూరాయి.

**తెలంగాణలో రూ. 5,819 కోట్లు**


తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా జీఎస్టీ వసూలయ్యాయి. జూలై నెలకుగాను రూ.5,819 కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో పోలిస్తే 19 శాతం వృద్ధిని సాధించింది. అలాగే రాష్ట్ర చరిత్రలో ఒకే నెలలో ఇంతటి స్థాయిలో వసూలవడం కూడా ఇదే తొలిసారి. హర్యాన తర్వాత అత్యధికంగా వసూలైనది ఇక్కడే. దీంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లలో రెండంకెల వృద్ధి నమోదైంది.

## ఐపీఓ, ఈక్విటీ వైపు తెలుగు రాష్ట్రాల చూపు!

దేశంలోనే సాహసోపేతమైన, చొరవగల వ్యాపార వర్గాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిలయంగా ఉన్నాయి. వ్యవసాయం, సంప్రదాయ పరిశ్రమల నుంచి ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల వరకు ఈ వర్గాలు ఎంతో ఆసక్తిగా ఉన్నాయి. అయితే, గత ఐదేళ్ల ఐపీఓ దరఖాస్తులపై జరిగిన విశ్లేషణను పరిశీలిస్తే.. తెలుగు వారి తదుపరి ఆర్థిక వృద్ధి ప్రయాణం స్టాక్ మార్కెట్లలోనే ఉండబోతోందని స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా 33 రాష్ట్రాలు, 785 పట్టణాల పరిధిలో నమోదైన 1.83 కోట్ల ఐపీఓ దరఖాస్తుదారులలో.. తెలంగాణ నుంచి 3.99 లక్షలు (2.17%), ఆంధ్రప్రదేశ్ నుంచి 4.41 లక్షలు (2.40%) నమోదయ్యాయి. మొత్తంగా 8.4 లక్షల మంది తెలుగు మదుపరులు ప్రైమరీ మార్కెట్లలో చురుగ్గా పాల్గొంటున్నారు. మహారాష్ట్ర, గుజరాత్ వంటి చారిత్రాత్మక మార్కెట్ లీడర్లతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ఈక్విటీ కల్చర్ మరింత ఎదగడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. తలసరి దరఖాస్తుదారులను చూస్తే.. జాతీయ సగటు 12,841 కాగా తెలంగాణలో ప్రతి పది లక్షల మందికి 10,490, ఆంధ్రప్రదేశ్‌లో 8,316 మంది ఉన్నారు. ఇది వీరి ఆకాంక్షలు తక్కువగా ఉన్నాయని చెప్పడానికి నిదర్శనం కాదు. తెలుగు కుటుంబాల పొదుపు క్రమశిక్షణ చాలా బలమైనది. ఇప్పటివరకు భూమి, బంగారం వంటి సంప్రదాయ ఆస్తులకే ప్రాధాన్యమిచ్చిన వీరు ఇకపై తమ పొదుపులో కొంత భాగాన్ని లిస్టెడ్ ఈక్విటీల వైపు మళ్లించేందుకు బలమైన అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**మౌలిక వసతులు సిద్ధం.. అడ్డంకి లేని ప్రయాణం**

మదుపు విస్తరణకు కావలసిన డిజిటల్ మౌలిక వసతులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి 1.24 కోట్లు, తెలంగాణ నుంచి 61 లక్షల నమోదిత ట్రేడింగ్ ఖాతాలు ఉన్నాయి. ట్రేడింగ్ ఖాతాల లభ్యత సులువైనందున సాధారణ పొదుపుదారులను క్రియాశీల ఈక్విటీ మదుపరులుగా మార్చడం తదుపరి ప్రాథమిక లక్ష్యం కానుంది. రియల్ ఎస్టేట్, బంగారం స్థిరత్వాన్నిస్తాయి. బ్యాంక్ డిపాజిట్లు నమ్మకాన్నిస్తాయి. కానీ ఈక్విటీలు దీర్ఘకాలంలో దేశ వ్యాపార వృద్ధిలో ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని, అధిక రాబడిని అందిస్తాయి. సెబీ ప్రోత్సహిస్తున్న సమతుల్య విధానం కూడా ఇదే.



## రికార్డు స్థాయిలో కార్ల అమ్మకాలు.. హ్యుందాయ్‌కు ఆల్‌టైమ్ రికార్డు!




ఇండియా కార్ల మార్కెట్‌కు 2026 జూలై నెల మంచి ఊపునిచ్చింది. దేశంలోని ప్రముఖ కార్ల తయారీ సంస్థలు దాదాపు అన్నీ కూడా.. గత ఏడాది జూలైతో పోలిస్తే మెరుగైన అమ్మకాలను నమోదు చేశాయి. ముఖ్యంగా హ్యుందాయ్ తన చరిత్రలోనే అత్యధిక నెలవారీ అమ్మకాలను సాధించగా, టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల్లో భారీ వృద్ధిని నమోదు చేసింది. మహీంద్రాకంపెనీ ఎస్‌యూవీ విభాగంలో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకోగా, కియా, టయోటా, ఎంజీ మోటార్, నిస్సాన్ కూడా బలమైన విక్రయాలను పొందాయి. టాటా మోటార్స్.. జూలైలో మొత్తం 63,760 ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 40 వేల యూనిట్లతో పోలిస్తే ఇది 59 శాతం ఎక్కువ. ఇందులో దేశీయ మార్కెట్‌లోనే 62,611 వాహనాలు అమ్ముడయ్యాయి. ముఖ్యంగా.. ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో టాటా మరోసారి తన సత్తా చాటింది. జూలైలో 15,217 ఈవీలను విక్రయించి గత ఏడాది కంటే.. 114 శాతం వృద్ధిని నమోదు చేసింది. మహీంద్రా కంపెనీ.. జూలైలో దేశీయ మార్కెట్‌లో 60,048 ఎస్‌యూవీలను విక్రయించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 20 శాతం అధికం. అన్ని రకాల వాహనాలను కలిపి చూస్తే మహీంద్రా మొత్తం 1,03,860 యూనిట్లను విక్రయించి 26 శాతం వృద్ధిని సాధించింది. విదేశీ మార్కెట్లకు చేసిన ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా.. దేశీయ అమ్మకాలు, ఎగుమతులు కలిపి మొత్తం 75,360 వాహనాలను విక్రయించింది. ఇది హ్యుందాయ్ భారత చరిత్రలోనే అత్యధిక నెలవారీ అమ్మకాలుగా నిలిచింది. దేశీయంగా 54,210 కార్లు అమ్ముడవగా, ఎగుమతులు కూడా ఎనిమిదేళ్లలో అత్యధిక స్థాయికి చేరాయి. కంపెనీకి అత్యధిక అమ్మకాలు తెచ్చిపెట్టిన మోడల్‌గా క్రెటా నిలవగా, ఐ20 కూడా ఈ ఏడాదిలో అత్యుత్తమ నెలవారీ విక్రయాలను నమోదు చేసింది. కియా ఇండియా కూడా.. జూలైలో రికార్డు స్థాయి అమ్మకాలను నమోదు చేసింది. మొత్తం 28,200 యూనిట్లను విక్రయించి గత ఏడాదితో పోలిస్తే 27.4 శాతం వృద్ధిని సాధించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు కంపెనీ విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా కొత్త తరం సెల్టోస్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోంది. సోనెట్, కారెన్స్ క్లావిస్, కారెన్స్ క్లావిస్ ఈవీ, సైరోస్ ఈవీ వంటి మోడళ్లు కూడా అమ్మకాలకు ఊతమిచ్చాయి. టయోటా కిర్లోస్కర్ మోటార్ జులైలో మొత్తం 32,516 వాహనాలను విక్రయించి వృద్ధిలో నిలకడను చూపించింది. దేశీయ మార్కెట్‌లో 30,516 యూనిట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే.. కంపెనీ దేశీయ అమ్మకాలు 5 శాతం పెరిగాయి. అలాగే ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో టయోటా మొత్తం విక్రయాలు 13 శాతం వృద్ధిని నమోదు చేశాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. వరుసగా రెండో నెల అత్యధిక నెలవారీ అమ్మకాలను నమోదు చేసింది. జూలైలో 8,158 వాహనాలను విక్రయించిన కంపెనీ, తన మొత్తం అమ్మకాలలో 80 శాతానికి పైగా ఎలక్ట్రిక్ వాహనాలేనని వెల్లడించింది. దీంతో భారత ఈవీ మార్కెట్‌లో ఎంజీ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఇక నిస్సాన్ జూలైలో.. దేశీయ మార్కెట్‌లో 4,518 వాహనాలను విక్రయించి ఏకంగా 218 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇటీవల విడుదలైన కొత్త టెక్టాన్ ఎస్‌యూవీకి వినియోగదారుల నుంచి మంచి స్పందన రావడంతో కంపెనీ అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి.

## పర్సులో ప్లాస్టిక్ పవర్

స్మార్ట్‌ఫోన్ కొనాలన్నా, విమానం టికెట్ బుక్ చేసుకోవాలనుకున్నా, అభిమాన హీరో సినిమా మొదటి ఆట టికెట్ కొనాలన్నా, ఇష్టమైన గాయకుడి కచేరీకి వెళ్లాలనుకున్నా.. ఒకప్పుడు ధర చూసి నిర్ణయం తీసుకునే వినియోగదారుడు ఇప్పుడు ఏ కార్డు వాడితే ఎక్కువ క్యాష్‌బ్యాక్ వస్తుంది ఏ కార్డుతో కొంటే ముందుగా టికెట్ దొరుకుతుంది ఏ బ్యాంక్ ఆఫర్ బెస్ట్? అని లెక్కవేస్తున్నాడు. క్రెడిట్ కార్డులు ఒకప్పటిలా కేవలం బిల్లు చెల్లింపు సాధనాలుగా కాకుండా కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తివంతమైన మార్కెటింగ్ ఆయుధాలుగా మారాయి. డిజిటల్ చెల్లింపుల ప్రపంచాన్ని ఇవి పూర్తిగా మార్చేస్తున్నాయి. ఒకప్పుడు బిల్లులు చెల్లించే సాధనంగా చివర్లో బయటకు వచ్చే క్రెడిట్ కార్డు... ఇప్పుడు వినియోగదారుడి కొనుగోలు నిర్ణయాలను శాసించే 'ప్లేయింగ్ కార్డ్'గా మారి కొనడానికి ముందే ప్రభావితం చేస్తోంది. ధర కంటే ఆఫర్, అవసరం కంటే రివార్డు ముఖ్యమవుతున్న ఈ కొత్త వినియోగ సంస్కృతి, ప్లాస్టిక్ కార్డు పవర్ రిటైల్ మార్కెట్‌ను కొత్త దిశలో నడిపిస్తున్న ట్రెండ్‌పై వెల్త్ స్టోరీ దేశంలో డిజిటల్ చెల్లింపుల విస్తరణతో పాటు క్రెడిట్ కార్డుల పాత్ర కూడా వేగంగా పెరుగుతోంది. ఒకప్పుడు కొనుగోలు పూర్తయ్యాక ఉపయోగించే క్రెడిట్ కార్డు కొనుగోలు ప్రక్రియ ప్రారంభంలోనే కస్టమర్‌ను ప్రభావితం చేస్తోంది. ఈకామర్స్, ట్రావెల్, ఎలక్ట్రానిక్స్, వినోద రంగాల్లో ప్రత్యేక క్రెడిట్ కార్డుల ఆఫర్లు కొనుగోలు నిర్ణయాలను మలుపు తిప్పుతున్నాయి.

## రోజుకు రూ.96,383 కోట్లు.. క్యాష్ కాదు!



దేశంలో డిజిటల్ చెల్లింపుల జోరు కొనసాగుతోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) జూలైలో కొత్త రికార్డు సృష్టించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గణాంకాల ప్రకారం.. జూలైలో యూపీఐ ద్వారా 2,366 కోట్ల లావాదేవీలు జరిగాయి. జూన్‌లో నమోదైన 2,272 కోట్లతో పోలిస్తే ఇది 4.1 శాతం అధికం. గతేడాది జూలైతో పోలిస్తే లావాదేవీల సంఖ్య ఏకంగా 22 శాతం పెరిగింది. లావాదేవీల విలువ కూడా భారీగా పెరిగింది. జూన్‌లో రూ.28.92 లక్షల కోట్లుగా ఉన్న యూపీఐ లావాదేవీల విలువ.. జూలైలో రూ.29.88 లక్షల కోట్లకు చేరింది. నెలవారీగా ఇది 3.3 శాతం వృద్ధి. అయితే మేలో నమోదైన రూ.29.90 లక్షల కోట్ల రికార్డుతో పోలిస్తే జూలై విలువ స్వల్పంగా తక్కువగానే ఉంది. అంటే జూలైలో లావాదేవీల సంఖ్య మాత్రం ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరగా, విలువలో కొత్త రికార్డు నమోదు కాలేదు. జూలైలో యూపీఐ రోజుకు సగటున 76.3 కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసింది. జూన్‌లో ఈ సగటు 75.7 కోట్లుగా ఉంది. రోజువారీ లావాదేవీల సగటు విలువ రూ.96,383 కోట్లుగా నమోదైంది. జూన్‌లోని రూ.96,405 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు స్థిరంగానే ఉంది. మరోవైపు, ఎన్ఈటీసీ ఫాస్టాగ్ లావాదేవీల్లో తగ్గుదల కనిపించింది. జూలైలో 34.7 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. జూన్‌లోని 36.2 కోట్లతో పోలిస్తే 4.1 శాతం తగ్గాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే దాదాపు 6 శాతం క్షీణత నమోదైంది. ఫాస్టాగ్ లావాదేవీల విలువ కూడా స్వల్పంగా తగ్గింది. జూన్‌లో రూ.7,215 కోట్లుగా ఉన్న విలువ.. జూలైలో రూ.7,143 కోట్లకు పడిపోయింది. మేలో నమోదైన రూ.7,308 కోట్లతో పోల్చినా ఇది తక్కువే. ఫాస్టాగ్ వినియోగంలో ఈ మార్పు నేపథ్యంలో, కేంద్రం అమలు చేస్తున్న వార్షిక పాస్ పథకం కూడా కీలకంగా మారింది. 2026-27లో రూ.3,075 చెల్లించి పొందే వార్షిక పాస్‌తో నేషనల్ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల టోల్ ప్లాజాల వద్ద ఏడాదిలో 200 సార్లు లేదా ఒక సంవత్సరం వరకు ప్రయాణించే అవకాశం ఉంది. జూన్ 2026 నాటికి 77 లక్షలకు పైగా వార్షిక పాస్‌లు జారీ కాగా, ఇవి 63 కోట్ల టోల్ లావాదేవీలకు దోహదపడ్డాయని కేంద్రం తెలిపింది.




# రామాయణంలో సీత పాత్ర వివాదం..

**సాయి పల్లవి పాత ఇంటర్వ్యూ వైరల్!**

రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. సీత పాత్రకు సాయి పల్లవిని ఎలా తీసుకున్నారంటూ కొందరూ కామెంట్లు చేస్తుండగా.. ఈ చర్చల మధ్య సాయిపల్లవి గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది. సాంప్రదాయ రూపురేఖల గురించి కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, ఆమె నటనకు, సహజ సౌందర్యానికి మరికొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి మొటిమల సమస్య, ఫెయిర్‌నెస్ క్రీమ్ యాడ్ తిరస్కరించడం గురించి సాయి పల్లవి గతంలో చెప్పిన ఆసక్తికర విషయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సినిమాల్లోకి రాకముందు తనకు ఉన్న మొటిమలు, రోసిషియా సమస్య కారణంగా ఎంతో ఆందోళన చెందానని సాయి పల్లవి గతంలో తెలిపారు. 'ప్రేమమ్' సినిమా విడుదలకు ముందు నేను ఎన్నో ఫెయిర్‌నెస్ క్రీమ్‌లు వాడాను. ముఖంపై మొటిమల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించాను. నలుగురిలోకి వెళ్లడానికి భయపడేదాన్ని. జనం నా కళ్లను కాకుండా నా మొటిమలనే చూస్తున్నారని బాధపడేదాన్ని అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే 'ప్రేమమ్' చిత్రంతో ప్రేక్షకులు తనను ఉన్నట్లుగానే ఆదరించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు. సౌందర్య ప్రమాణాలు, రంగు వివక్షపై సాయి పల్లవి ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇందులో భాగంగానే రూ. 2 కోట్ల విలువైన ఫెయిర్‌నెస్ క్రీమ్ ఎండార్స్‌మెంట్ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించారు. సమాజంలో ఇటువంటి ప్రచారాలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆమె భావించారు. సమాజంలో రంగు ఆధారంగా ఎంతోమందిని చిన్నచూపు చూస్తున్నారు. అలాంటి ప్రమాణాలను నేను ప్రమోట్ చేయలేను అని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె పాత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.



# పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా

## నటి మాళవికా మోహనన్

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.



# ఆది కొత్త సినిమా సైరాబాను

## క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం

**టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.**

# ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.



# కొత్త మూవీని ప్రకటించిన సాయిదుర్గా తేజ్

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు సాయి దుర్గా తేజ్. తాజాగా ఆయన ఒక కొత్త మూవీని ప్రకటించారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ ల దర్శకత్వంలో సాయిదుర్గా తేజ్ హీరోగా ఈ చిత్రం రానుంది. 'ఎస్‌డీటీ 19' వర్కింగ్ టైటిల్‌తో దీన్ని అధికారికంగా ప్రకటించారు. 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు.. అత్యంత శక్తిమంత ప్రయాణమిది' అని క్యాప్షన్‌తో దీనిపై పోస్ట్ పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు)తో బిజీగా ఉన్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. దీనిపై ఇటీవల ఈ హీరో మాట్లాడుతూ.. బ్రో' తర్వాత ఖరారైన నా రెండు సినిమాలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఇందులో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా కష్టపడుతున్నా. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా నా కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని అన్నారు.




Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com